# కేసీఆర్ ప్రభుత్వంలోనే అనేక సంక్షేమ పథకాలు

- రాష్ట్రంలో పదేండ్లలో 50 ఏండ్ల అభివృద్ధి
- ప్రజలను ఆగం చేసే కాంగ్రెస్, బీజేపీ కావాలా.. అభివృద్ధి చేసే బీఆర్ఎస్ కావలా?
- కార్నర్ మీటింగ్‌లో ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 29 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హయాంలోనే రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలయ్యాయని, రాష్ట్రం పదేండ్లలో 50 ఏండ్ల అభివృద్ధి సాధించిందని బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ప్రజలను ఆగం చేసే కాంగ్రెస్, బీజేపీ కావాలా.. అభివృద్ధి చేసే బీఆర్ఎస్ కావాలా అని అడిగారు. జిల్లాకేంద్రంలోని 53వ డివిజన్‌లో శాంతినగర్‌లో కార్నర్ సమావేశాన్ని సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలను అదనుగా చేసుకొని ఆగస్టు 15న మాఫీ చేస్తామని చెబుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఆడబిడ్డల పెండ్లికి కల్యాణలక్ష్మి కింద లక్షలతోపాటు తులం బంగారాం ఇస్తామని చెప్పి ఇప్పటివరకూ ఒక్కరికి కూడా ఇవ్వలేరని అన్నారు.

**ఢిల్లీలో ప్రశ్నించే గొంతును గెలిపించాలి : బిగాల**

ఢిల్లీలో మన తరపున ప్రశ్నించే గొంతు బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా కోరారు. తాను జిల్లాకేంద్రాన్ని పదేండ్లలో ఎంతో సుందరంగా తీర్చిదిద్దానని అన్నారు. బీజేపీ కులమతాలను రెచ్చగొట్టి ఓట్లు దండుకోవాలని చూస్తున్నదని ఆరోపించారు. కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో రెడ్కో మాజీ చైర్మన్ అలీం, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఉద్యమనాయకులు సుజిత్ సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## సొంత గూటికి తాజా మాజీ సర్పంచ్ తారాసింగ్


బాజిరెడ్డి గోవర్ధన్‌తో తాజా మాజీ సర్పంచ్ తారాసింగ్

డిచ్‌పల్లి, ఏప్రిల్ 29 : మండలంలోని నకతండా గ్రామ తాజా మాజీ సర్పంచ్ తారాసింగ్.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేసే అవకాశం లేకపోవడం, కాంగ్రెస్‌లో నాయకుల ధోరణి నచ్చక తిరిగి ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఆధ్వర్యంలో సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. సర్పంచ్‌కు బాజిరెడ్డి గులాబీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు లక్ష్మీనర్సయ్య, సీనియర్ నాయకులు పద్మారావు, కృష్ణ, చాకలి సాయిలు పాల్గొన్నారు.

## రాయకూర్‌లో మెగా వైద్యశిబిరం

రుద్రూర్, ఏప్రిల్ 29 : మండలంలోని రాయకూర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూర్, ఫుడ్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం, రక్తదాన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. రాయకూర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో 246 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. నిజామాబాద్ ప్రతిభ దవాఖాన సౌజన్యంతో వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 21 మంది ఫుడ్ సైన్స్‌కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. నిజామాబాద్ రెడ్‌క్రాస్, బోధన్ కంటి దవాఖాన డాక్టర్ తహసీన్, బోధన్ లైఫ్‌కేర్ దవాఖాన వైద్యుడు ఇర్ఫాన్ అలీ, నిజామాబాద్ ప్రతిభ దవాఖాన వైద్యురాలు జ్యోత్స్న గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫుడ్‌సైన్స్ కళాశాల అసోసియేట్ కల్పన, వెంకట్‌రెడ్డి, జె.సాయిప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ సిబ్బంది, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శ్యాంసుందర్, సభ్యుడు తుక్కి మహేందర్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ సమావేశం


సమావేశంలో పాల్గొన్న చిన్నారులు, వారి తల్లులు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 29 : ఇందల్‌వాయిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్ ఫుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభ పాల్గొని చిన్నారులు, వారి తల్లులతో మాట్లాడి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అన్నారు. అనంతరం ప్రీ స్కూల్ అసైన్డ్‌మెంట్ కార్డులను చిన్నారులకు అందజేసి, అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో టీచర్లు తాడెం శోభ, ప్రమీల, జమున తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

- మొత్తం 25 మందిపై కేసు

వినాయక్‌నగర్, ఏప్రిల్ 29 : ట్రాఫిక్ పోలీసులు ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 25 మంది వాహనదారులపై కేసులు నమోదు చేశారు. వారికి ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ కౌన్సెలింగ్ నిర్వహించారు. సోమవారం మార్నింగ్ కోర్టులో నిజామాబాద్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ ఎదుట హాజరుపర్చగా.. 23 వాహనదారులకు రూ.22,500 జరిమానా విధించారని, మిగతా ఇద్దరికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ వెల్లడించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసులు కోరారు.

## 2.1 కిలోల గంజాయి పట్టివేత

- నిర్మల్‌కు చెందిన ఇద్దరిపై కేసు నమోదు.. రిమాండ్‌కు తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సైలు వినయ్, భాస్కరాచారి

వేల్పూర్, ఏప్రిల్ 29: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేల్పూర్, ముప్కాల్ ఎస్సైలు వినయ్, భాస్కర చారి తెలిపారు. సోమవారం వారు విలేకరులకు వివరాలు వెల్లడించారు. నిర్మల్ జిల్లాకు చెందిన ఇద్దరు బాల్కొండ, వేల్పూర్, భీమ్‌గల్ మండలాల యువతకు నిషేధిత గాంజాయిని సరఫరా చేసేందుకు తిరుగుతున్నారని పోలీసులకు పక్కా సమాచారం అందింది. వేల్పూర్ మండలం వెంకటాపూర్ రోడ్డులోని సాయికృష్ణ రైస్‌మిల్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అటువైపు బైక్‌పై వచ్చిన ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ఆపి వారి వారివద్ద ఉన్న సంచిని తనిఖీ చేయగా అందులో రెండు కిలోల 100 గ్రాముల గంజాయి లభించింది. దీనిని పోలీసులు స్వాధీనం చేసుకుని విచారించగా నిందితులు సయ్యద్ అజీమ్, షేక్ సోహెల్ ఇద్దరూ నిర్మల్‌కు చెందిన వారని తేలింది. రోజులుగా బాల్కొండ, వేల్పూర్, భీమ్‌గల్ మండలాల యువతే లక్ష్యంగా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో మహారాష్ట్ర నుంచి గంజాయిని తక్కువ ధరకు తీసుకొచ్చి ఇక్కడ ఎక్కువ రేటుకు అమ్ముతున్నామని నిందితులు నేరం ఒప్పుకున్నారు. వారిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. యువత గంజాయి సేవించినా చట్టరీత్యా నేరమని, వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని, ఎవరూ చెడు అలవాట్లకు బానిసై కేసుల్లో ఇరుక్కుని భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని ఎస్సైలు హెచ్చరించారు.

## నిజాయితీగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎలిస్ వజ్ ఆర్,
- బస్టాండ్‌లో ఓటు హక్కు అవగాహనపై ఛాయాచిత్ర ప్రదర్శన ప్రారంభం


ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న ఎలిస్ వజ్ ఆర్, అధికారులు

కంఠేశ్వర్, ఏప్రిల్ 29 : కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఓటుహక్కు అవగాహనపై ఛాయాచిత్ర ప్రదర్శనను జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం ఏర్పాటు చేశారు. ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎలిస్ వజ్ ఆర్, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ రిబ్బన్ కట్ చేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలోని ప్రతి ఓటరు తమ ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యపద్ధతిలో, నిజాయితీగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. మూడు రోజుల పాటు ప్రదర్శన కొనసాగనున్నట్లు తెలిపారు. ఎన్నికల చరిత్ర, మొబైల్ యాప్‌లు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు తదితర వస్తువులు ప్రదర్శనలో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మానాయక్, ఆర్టీసీ ఆర్ఎం జానీరెడ్డి, స్వీప్ జిల్లా నోడల్ అధికారి సురేశ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

- **బీజేపీని ప్రజలు ఓడించాలి-** బోధన్, ఏప్రిల్ 29: వచ్చే ఎన్నికల్లో బీజేపీని ప్రజలు ఓడించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేశ్ అన్నారు. బోధన్ పట్టణం తట్టికోట్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ దేశ సంపదను బడా కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో మాస్‌లైన్ (ప్రజాపంథా) మండల కార్యదర్శి పడాల శంకర్, సహాయ కార్యదర్శి సుల్తాన్ సాయిలు, ప్రగతిశీల మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు నాగమణి తదితరులు పాల్గొన్నారు.
- **ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్29:** పసుపు బోర్డు సాధన, పసుపు పంటకు కనీస మద్దతు ధర రూ.15,000 ఇప్పించడంలో విఫలమైన బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని జేఏసీ నాయకులు కోరారు. పట్టణంలోని ఓ ప్రవేట్ ఫంక్షన్ హాల్‌లో జేఏసీ నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం సోమవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన ఎంపీ అర్వింద్‌కు ఓటు అడిగే అర్హత లేదన్నారు. సమావేశంలో జేఏసీ నాయకులు అన్వేశ్‌రెడ్డి, దేగం యాదగౌడ్, ప్రభాకర్, దేగం లింగన్న, దేవారాం తదితరులు పాల్గొన్నారు.
- **డిగ్రీ విద్యార్థులు పరీక్షల ఫీజు చెల్లించాలి-** డిచ్‌పల్లి, ఏప్రిల్ 29 : టీయూ పరిధిలోని బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సులకు 3, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ 2019 నుంచి 2023 బ్యాచ్‌కు చెందిన వారు ఫీజు చెల్లించాలని కంట్రోలర్ అరుణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 7వ తేదీ వరకు గడువు ఉన్నదని, అపరాధ రుసుముతో మే 8వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. మే-జూన్ 2024లో పరీక్షలు నిర్వహించనున్నామని, మరిన్ని వివరాలకు టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.
- **సదస్సుపై దాడిని ఖండిస్తున్నాం -** డిచ్‌పల్లి, ఏప్రిల్ 29 : వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆదివారం నిర్వహించిన లౌకిక విలువలు - సాహిత్యం సదస్సులో పలువురిపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని పీడీఎస్‌యు రాష్ట్ర ప్రధానకార్యదర్శి నామాల ఆజాద్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్ వారు దాడి చేశారని, వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.
- **చెరువులో పడి ఒకరి మృతి -** డిచ్‌పల్లి, ఏప్రిల్ 29 : స్థానిక బస్టాండ్ పక్కన ఉన్న చెరువులో పడి ఒకరు మృతిచెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ధర్పల్లి మండలం సల్లగరిగె గ్రామానికి చెందిన మీసాల సాయిలు (54) సోమవారం చేపలు పట్టేందుకు వెళ్లారు. కాలు జారి చెరువులో పడడంతో ఊపిరాడక మృతిచెందాడు. మృతుడి కుమారుడు మీసాల సాగర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## జిల్లాకేంద్రంలో సెంట్రల్ ఫోర్స్ ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్

వినాయక్‌నగర్, ఏప్రిల్ 29 : జిల్లాకేంద్రంలో ఏసీపీ రాజా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సెంట్రల్ ఫోర్స్ సోమవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించింది. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఓటరు నిర్భయంగా, నమ్మకంతో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎవరూ భయాందోళనలకు గురికావొద్దన్న ధైర్యాన్ని ఇచ్చేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని తెలిపారు. ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) బలగాలు ఆయుధాలు ధరించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరితో పాటు సివిల్ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నట్లు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు.

## కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం


ధర్పల్లిలో ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

ధర్పల్లి/ సిరికొండ, ఏప్రిల్ 29 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమని, ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు, మండల కన్వీనర్ పీసు రాజ్‌పాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు నల్ల హన్మంత్‌రెడ్డి అన్నారు. ఎల్ఈడీ స్క్రీన్ ఉన్న ఎన్నికల ప్రచార వాహనం సోమవారం సాయంత్రం ధర్పల్లికి రాగా.. వాహనం వెంట వెళ్లి బాజిరెడ్డికి మద్దతుగా ముమ్మర ప్రచారం చేశారు. పదేండ్లలో రూరల్ ప్రాంతాన్ని బాజిరెడ్డి గోవర్ధన్ ఎంతో అభివృద్ధి చేశారని అన్నారు. ప్రజలు కాంగ్రెస్ నేతలు చెప్పిన అసత్య ప్రచారాలు నమ్మి మోసపోయారని, మరోసారి మోసపోవద్దని సూచించారు. అంతకుముందు పీసు రాజ్‌పాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్ ఆధ్వర్యంలో బూత్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ చెలిమెల చిన్నారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, సొసైటీ డైరెక్టర్ సబావత్ శ్రీనివాస్‌నాయక్, గంగారెడ్డి పాల్గొన్నారు.

సిరికొండ మండలంలోని రావుట్లలో వైస్ ఎంపీపీ తోట రాజన్న, నాయకుడు రాజేందర్ బాజిరెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. కారు గుర్తుకే ఓటు వేసి బాజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## బాజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం

- మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్

ఇందల్వాయి, ఏప్రిల్ 29 : బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దామని మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ అన్నారు. మండలంలోని గన్నారం, నల్లవెల్లి, మెగ్యానాయక్ తండా, సిర్నాపల్లి గ్రామాల్లో బూత్ కమిటీలతో సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. బూత్‌స్థాయి కమిటీ సభ్యులు, కార్యకర్తలకు ప్రచార కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించి, బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషిచేయాలన్నారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ రమేశ్ నాయక్, మండల అధ్యక్షుడు దాసు, వైస్ ఎంపీపీ భూసాని అంజయ్య, మోహన్‌నాయక్, పాశం కుమార్, విజయ్‌కుమార్, గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.


బూత్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్

## కాంగ్రెస్, బీజేపీలకు ఓటుతో బుద్ధి చెప్పాలి

- జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు


మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

నవీపేట, ఏప్రిల్ 29: ఐదేండ్ల పాటు నిజామాబాద్ ఎంపీగా కొనసాగిన ధర్మపురి అర్వింద్ బోధన్ నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించారని జడ్పీ చైర్మన్, బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఎన్నికల బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్వింద్ గత ఎన్నికల్లో ఇచ్చిన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైందని అన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ బూత్ కమిటీ సభ్యులు విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వి.నర్సింగ్‌రావు, నాయకులు సూరిబాబు, లోకం నర్సయ్య, మంత్రి గంగాధర్, షకీల్, అంజలీ, పోసాని, కమిటీ కన్వీనర్లు, సభ్యులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మాటలు నమ్మొద్దు

- ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి


దేగాంలో ప్రచారం నిర్వహిస్తున్న జీవన్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్29: కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మవద్దని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. ఆలూర్ మండలంలోని దేగాం గ్రామంలో సోమవారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందడంతోపాటు పేదలకు సంక్షేమ పథకాలు పక్కాగా అందాయన్నారు. ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధికి తాను అధికంగా నిధులు తీసుకువచ్చానని అన్నారు. వరికి రూ.500 బోనస్ ఇస్తానని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. ఎన్నికల ప్రచారం చేస్తున్న సందర్భంగా జీవన్‌రెడ్డిని ఓ వృద్ధురాలు ఆత్మీయంగా పలకరించింది.

## వడ్లు తిరిగి ఇవ్వకుంటే ఏఎంసీలోనే వంటవార్పు..

- కోటగిరి ఏఎంసీ కార్యదర్శి తీరుపై రైతుల మండిపాటు
- మార్కెట్ కమిటీ గేటు వద్ద బైఠాయించి నిరసన


కోటగిరి మార్కెట్ కమిటీ గేటు వద్ద ధర్నా చేస్తున్న రైతులు

కోటగిరి, ఏప్రిల్ 29 : ఏఎంసీ గోదాంలో గతేడాది, 6 నెలల క్రితం నిల్వ ఉంచిన వడ్లు తిరిగి తమకు ఇవ్వాలని వివిధ గ్రామాల రైతులు కోటగిరి మార్కెట్ కమిటీ గేటు వద్ద సోమవారం బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ధాన్యం కోసం డీడీలు కట్టి 15 రోజుల నుంచి కార్యాలయం చుట్టూ తిరిగినా మార్కెట్ కమిటీ కార్యదర్శి పట్టించుకోవడం ఆవేదన వ్యక్తం చేశారు. సెక్రటరీ రాలేదని సిబ్బంది చెప్పడంతో 15 రోజుల నుంచి కార్యదర్శి ఎందుకు రావడం లేదని, అటెండెన్స్ రిజిస్టర్ చూస్తామని రైతులు కోరడంతో సిబ్బంది నిరాకరించారు. రిజిస్టర్ లేదని సమాధానం చెప్పడంతో సిబ్బంది తీరుపై రైతులు మండిపడ్డారు. ఫోన్ చేస్తే సెక్రటరీ ఎందుకు ఫోన్‌ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు నిల్వ ఉంచిన ధాన్యాన్ని రెండు వారాల్లో రైతులకు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించినా పట్టించుకోకపోవడం, డీడీలు తీసుకొని రిసీవుడ్ కాపీ ఇవ్వాలని రైతులు కోరినా సిబ్బంది నిరాకరించడంతో రైతులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వడ్లు ఇచ్చే వరకు మార్కెట్ కమిటీలోనే రైతులంతా వంటవార్పు చేసుకుంటామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో రైతులు శంకర్‌పటేల్, ముర్గె హన్మంతరావు, నీరడి గంగాధర్, లోని జగన్, సునీల్, ఉదయ్ భాస్కర్, సాదక్ తదితరులు పాల్గొన్నారు.

## వడ్ల కుప్పను ఢీకొని యువకుడి మృతి

నందిపేట్, ఏప్రిల్ 29 : మండలంలోని సీహెచ్ కొండూర్ గ్రామ సమీపంలోని లోకేశ్వర్-నందిపేట్ ప్రధాన రోడ్డుపై ధాన్యం కుప్పలను బైక్ ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందాడు. నిర్మల్ జిల్లా లోకేశ్వర్ మండల కేంద్రానికి చెందిన సూర్యకిరణ్ (30) నందిపేట్ మండలంలోని తల్వేద గ్రామంలో ఆదివారం జరిగిన ఫంక్షన్‌కు హాజరై తిరిగి అదేరోజు రాత్రి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. రోడ్డుపై ఉన్న వడ్ల కుప్ప కనిపించకపోవడంతో బైక్ వడ్ల కుప్పను ఢీకొని సూర్యకిరణ్ ఎగిరి పడ్డాడు. తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. రోడ్డు వెంట వెళ్తున్న వారు గమనించి ఆయనను దవాఖానకు తరలించే లోగా అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది. మృతుడు లోకేశ్వర్‌లో సూపర్‌మార్కెట్ నడుపుతుండాడని, ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు స్థానికులు తెలిపారు.

**అమృతాపూర్ యువకుడికి తీవ్ర గాయాలు**

డిచ్‌పల్లి, ఏప్రిల్ 29: వడ్లకుప్పను బైక్ ఢీకొనడంతో మండలంలోని అమృతాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలైనట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. శ్రీకాంత్‌కు డిచ్‌పల్లి గ్రామం నుంచి ఆదివారం రాత్రి తన స్వగ్రామానికి వెళ్తుండగా రోడ్డుపై ఉన్న వడ్ల కుప్పను బైక్ ఢీకొంది. దీంతో ఆయన కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా దవాఖానకు తరలించారు. రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబెడితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

## తాళం వేసిన పాఠశాలలో చోరీ

ముప్కాల్, ఏప్రిల్ 27: వేసవి సెలవుల కారణంగా తాళం వేసి ఉన్న మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోరీ జరిగినట్లు ఉపాధ్యాయుడు మధుసూదన్ సోమవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. వేసవి సెలవుల కారణంగా ఈనెల 24న పాఠశాలకు ఉపాధ్యాయుడు తాళం వేసి వెళ్లాడు. సోమవారం అటెండర్ పాఠశాలకు వెళ్లి చూడగా నాలుగు గదుల తలుపులు తెరిచి ఉన్నాయి. అనంతరం ఉపాధ్యాయుడు వెళ్లి చూడగా ఆంప్లిఫైయర్, 50 వాట్ల స్పీకర్లు, మౌత్ పీస్‌లు, రెండు ఎక్స్‌టెన్షన్ బాక్స్‌లు దాదాపు రూ.30 వేల విలువైన వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఉపాధ్యాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## మనస్తాపంతో వృద్ధురాలి ఆత్మహత్య

బాల్కొండ, ఏప్రిల్ 29: మండలంలోని కిసాన్‌నగర్‌కు చెందిన పాతకాల చిన్నుబాయి(70) ఎస్సారెస్పీ వరద కాలువలో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై శంకర్ సోమవారం తెలిపారు. ఏఎస్సై కథనం మేరకు.. చిన్నుబాయి కుమారుడు ప్రవీణ్‌కు అప్పులు అయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలో తెలియక కొంతకాలంగా ఆమె బాధపడుతోంది. మనస్థాపానికి గురై ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో ఇంట్లో నుంచి వెళ్లి కిసాన్‌నగర్ సమీపంలోని ఎస్సారెస్పీ వరదకాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



టీయూ ప్రొఫెసర్ నసీం ఉద్యోగ విరమణ సందర్భంగా టీయూ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గంటా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. 30 ఏండ్లుగా ఆమె సేవలందించి, ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. అనంతరం నసీం దంపతులను గజమాలతో సన్మానించారు.
– డిచ్‌పల్లి, ఏప్రిల్ 29

## పేద కుటుంబానికి స్వచ్ఛంద సంస్థ ఆసరా

భీమ్‌గల్, ఏప్రిల్ 29: ఇచ్చిన మాట ప్రకారం జీఎస్4ఎస్ (గంగస్వామి ఫర్ సొసైటీ) సంస్థ వ్యవస్థాపకుడు పిల్లోల్ల గంగస్వామి బాచన్‌పల్లి గ్రామానికి చెందిన లక్ష్మి కుటుంబానికి టిఫిన్ సెంటర్‌కు సంబంధించిన సామాగ్రిని సమకూర్చి సోమవారం ప్రారంభించారు. లక్ష్మికి భర్త లేడు, ఆమె కుమారుడు కరోనాతో గతంలో మృతిచెందాడు. దీంతో లక్ష్మి కోడలు, ముగ్గురు పిల్లలకు గంగస్వామి ధైర్యం చెప్పారు. భవిష్యత్తులో కుటుంబానికి అండగా ఉంటానని భరోసానిచ్చారు. హామీ మేరకు టిఫిన్ సెంటర్‌ను ప్రారంభించారు.

## స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్29: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ను సోమవారం ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎలిస్ వజ్ ఆర్ పరిశీలించారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ స్థలాన్ని పరిశీలించారు. ఆమెవెంట మాక్లూర్ తహసీల్దార్ షబ్బీర్, ఏసీపీ బస్వారెడ్డి, ఎస్‌హెచ్‌వో రవి కుమార్ తదితరులు ఉన్నారు.

## బోధన్‌లో పోలీసుల కవాతు

శక్కర్‌నగర్, ఏప్రిల్ 29: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు బలగాల ఉన్నాయన్న అవగాహన కలిగించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం బోధన పట్టణంలో పోలీసుల కవాతు నిర్వహించారు. స్థానిక పోలీస్ అధికారులతోపాటు ప్రత్యేక పోలీస్ బలగాలు ఈ కవాతులో పాల్గొన్నాయి. బోధన్ ఏసీపీ శ్రీనివాస్, పట్టణ సీఐ వీరయ్య, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో అడ్మిషన్లు ప్రారంభం

మాక్లూర్, ఏప్రిల్29: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు సూపర్‌వైజర్ సునీత తెలిపారు. కల్లడిలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఎర్లీ చైల్డ్‌వుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) కార్యక్రమంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాలు పై బడిన పిల్లలను నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతుల్లో చేర్పుకొని వారికి పౌష్టికాహారం అందజేస్తున్నామని తెలిపారు. తల్లితండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగ చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో టీచర్లు పద్మ, అంజమ్మ, సరోజ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**WANTED**
★SR ఆక్వా సొల్యూషన్స్, నిజామాబాద్ వాటర్ ప్యూరి ఫైయర్స్ నందు పనిచేయుటకు టెక్నీషియన్ (Male) కావలెను. Qual: ఇంటర్, జీతం + ఇన్సెంటివ్ సంప్రః 98482 68883
NTZ-324910

**WANTED**
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899
NT-311840-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.